# సంగీత

" సంగీతగారూ! మీతో కాసేపు మాట్లాడాలి." ఆమె ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది. ఆరడుగుల అజానుబాహువు - ఉంగరాల జుత్తు - చిరునవ్వుతో తనవంక చూస్తున్నాడు.

" నేనెవరో మీకు తెలియదు కదూ?" అతను ఒకడుగు ముందుకేసి అడిగాడు.

" తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు అని నాకు తెలుసు అని మీకు తెలుసా?" సంగీత చిరుకోపంతో చెప్పింది.

" అదే ! మీరు చాలా తెలివైన వాళ్ళు అని నాకు తెలుసు."

" తెలిసిందిగా - నా వెనకబడటం మానెయ్యండి" విసురుగా చెప్పింది.

" ఓ పని చేద్దాం - నా బైక్‌పైన మీకు డ్రాప్ యిస్తాను - వస్తారా!" అర్థింపు ఉంది అతని స్వరంలో.

" ఇలా అడ్డమైన మొగాళ్ళ వెనకాల కూర్చుని వెళ్ళడానికి నేను ఇష్టపడను అని మీరు తెలుసుకుంటారని నేను భావిస్తున్నాను" ఆచితూచి చెప్పింది.

" ఐసీ ! నేనైతే అడ్డంగా లేను- నిలువుగా ఉన్నాను అని మీరు తెలుసుకుంటారని నేను భావిస్తున్నాను" చిరునవ్వుతో చెప్పాడు.

" ఏయ్ ! మిస్టర్ వాటీజ్ యువర్ ప్రాబ్లం !" విసుగ్గా అడిగింది.

" నథింగ్ - లవ్ బగ్‌ది ప్రాబ్లం. నాది కాదు."

" నా గురించి తెల్సా ?"

" తెలియాల్సిన అవసరం లేదు అని అనుకుంటున్నాను. ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అని ఒక మహాకవి ఎప్పుడో అనేశాడు- ఏ స్త్రీ గత చరిత్ర చూసినా ఏమున్నది ఆశ్చర్యం- తల్లిదండ్రుల పెత్తనం- బానిసత్వం తప్ప" అతను చెప్పాడు.

" ఓహో ! టిపికల్ కేసు - నాకు కోపం తెప్పించద్దు - మీ పైన ర్యాగింగు కేసు బుక్ చేయించగలను" కోపంగా చెప్పింది.

" మీరాపని చేయరని నాకు తెలుసు అని మీకు తెలుసు అని నాకు తెలుసు."

" నా మాటలు నాకే చెబుతున్నారా!"

" జస్టు పిసికాలజీ ఆఫ్ లేడీసు."

" మహానుభావా ! దాన్ని సైకాలజీ అంటారనుకుంటాను - పిసికాలజీ కాదు- కొంచెం జాగ్రత్తగా మాట్లాడండి."

" నేను ఇంగ్లీషులో కొంచెం వీకు - పేపరు ఎప్పుడూ లీకు అవుతుండేది.

అందుకే మా టీచర్లు ఇంగ్లీషు నేర్పలేదు" చెప్పాడు.

" ఆపు నీ సుత్తి - నాకు పనుంది - నన్నొదిలెయ్యి".

" నేనేం పట్టుకుని కూర్చోలదు- మీరే ఆగిపోయారు" చిలిపిగా చెప్పాడు.

ఈసారి సంగీత ఆశ్చర్యపడింది. తన అసంకల్పిత చర్యకు వడివడిగా అడుగులు వేసింది ముందుకు. అతను కూడా ఆమెను అనుసరించాడు.

" ఇంతకూ నా పేరు ఎలా సంపాదించారు" కుతూహలంగా అడిగింది.

" అదేమంత పెద్ద విషయం కాదు - మనసుంటే మార్గం ఉంటుంది."

" ఐసీ ! అదేవుంటే నా దారికి అడ్డురారు" చురక అంటించింది.

" నా పేరు తెలుసుకోవాలన్న కుతూహలం మీకు లేదా?"

" నాకెందుకుంటుంది - అయినా మీరు చెప్పకుండా ఊరుకోరుగా " చిలిపిగా నవ్వింది.

" నా పేరు సుధాకర్ ! గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు పోస్టు వెలగబెడుతున్నాను - చాలా ఆస్తిపాస్తులున్నాయి" చెప్పాడు గర్వంగా.

" ఇవన్నీ నాకెందుకు చెబుతున్నట్లు"

" కయ్యానికైనా వియ్యానికైనా వారి చరిత్ర తెల్సుకోవడం మంచిది " చెప్పాడు.

" చరిత్ర మీ అభిమాన సబ్జెక్టు లాగుంది ".

" ఎలా చెప్పగలిగారు?"

" మీ ఊతపదం అది అయింది కాబట్టి"

" మీ ఇల్లు ఎక్కడో తెలుసుకోవచ్చా?"

" అది నీకు చెప్పకుండానే మీరు కనుక్కుంటారు కాబట్టి నేను చెప్పడం అవసరం" గడుసుగా అంది.

" అదేం పెద్ద కష్టం కాదు. ఇల్లు కనుక్కోవడమేముంది. మనసు కనుక్కోవడమంత కష్టం కాదు" తేలిగ్గా చెప్పాడు.

" ఐసీ ! నా బస్సు వచ్చింది - బై గబగబ పోబోతున్న బస్సు క్యాచ్ చేసింది.

చెయ్యి ఊపాడు సుధాకర్.

బస్సు దిగి ఇంటికి వచ్చింది. అది ఇల్లు కాదు... కొంత మంది వర్కింగు ఉమెన్ తీసుకుని ఉంటున్న ఇల్లు. ఓ ఎనిమిదదుగుల పెద్ద ఇండిపెండెంట్ ఇల్లు. ఓ పదహారు మంది దాకా ఉంటారు.

ఆమె రూమ్‌మేట్ అనూరాధ ఈమె కోసం వెయిట్ చేస్తున్నది.

" ఎందుకంత ఆలస్యం అయింది. నేను  ఆకలితో అల్లాడిపోతున్నాను."

" నా వెంట ఓ రోమియో పడ్డాడు. అతన్ని వదిలించుకుని బస్సు ఎక్కేసరికి కాస్త ఆలస్యం అయ్యింది" చెప్పింది జరిగిందంతా భోజనం అయిన తరువాత.

" అతను ఎప్పటి నుండి నీ వెంటపడుతున్నారు ?"

" రెండు మూడు నెలలు అయి ఉంటుంది. నేను గమనించి - కాని ఈ రోజే అతను ధైర్యం చేసి మాట్లాడింది" చెప్పింది.

" అతనిపైన నీ ఉద్దేశ్యం."

" దురభిప్రాయం అయితే లేదు."

" అంటే అతనికి నీ మనసులో కాస్త చోటిచ్చావన్నమాట."

" ఏమో తెలీదు - కాని అతను పక్కన ఉంటే చాలా ధైర్యంగా ఉంటుంది అని అనిపిస్తుంది" చిన్నగా చెప్పింది.

" ఆదివారం ముగ్గురం ఒక హోటల్లో కలుసుకుందాం. అతని సంగతి తేలుద్దాం సంగీతా" అనురాధ ప్రతిపాదించింది.

" అంతకంటేనా - అలాంటివి ఎక్కువకాలం సాగనివ్వకూడదు.... చూసేవాళ్ళకు చులకనయి పోతాం!" చెప్పింది.

అలాగే ముందుగా అనుకున్నట్లు ఓ డాబాలో కల్సుకున్నారు. అక్కడ పెద్ద జనసంచారం ఉండదు - దూరంగా టేబుల్స్ వేయించుకుని కూర్చున్నారు.

" నా ఫ్రెండు అనురాధ" చెప్పింది ఆమెను పరిచయం చేస్తూ.

" అదృష్టవంతురాలు " కాంప్లిమెంట్ ఇచ్చాడు.

ఎందుకో ఇద్దరికీ అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా చూశారు.

" సంగీతతో సగం జీవితం పంచుకుంటున్నదంటే తను నిజంగా ఎంతో అదృష్టవంతురాలే గదా!" ఈర్ష్యగా చెప్పాడు.

" బాబు ! ఆ అదృష్టం కావాలంటే ఎవరికైనా దక్కుతుంది - కాకపోతే కొన్ని కండీషన్లున్నాయి" అనురాధ అతన్ని అడ్డుకుంది.

" సుధాకర్ గారు ! మీకు వేరే పన్లు ఏమీ ఉండవా నన్ను ఫాలో అవడం తప్పించి" గోముగా అడిగింది.

" ఉంటాయి - కాని ముఖ్యమైన పన్లకోసం కొన్నింటిని వాయిదా వేస్తూ ఉంటాం గదా!" సుధాకర్ నవ్వాడు.

సర్వర్ వచ్చి ఆర్డర్లు తీసుకున్నాడు. మిక్చర్ వెజిటబుల్స్ టమేటా కర్రి, ఆలుకర్రీ- పుల్కాలు.

" రైట్ ! ఏమిటి మీ ఉద్దేశ్యం మా ఫ్రెండును ఫాలో కావడంలో ?" అనురాధ

అడిగింది.

" దేవత అనుగ్రహిస్తే పాణిగ్రహణం చేద్దామని" చెప్పాడు ధైర్యంగా.

" ఓ ! నా గురించి ఏమి తెల్సుకోకుండానే ఈ నిర్ణయానికొచ్చారా?" సంగీత అడిగింది.

" కొంత తెల్సు ... మీరు రంభ ఊర్వశి మేనకలు కల్సి పుట్టినిల్లు చాలా అందంగా ఉంటారు" చెప్పాడు తన్మయత్వంతో.

" చాలాచాలా అందంగా" అందించింది అనురాధ.

" నాకయితే తెలియదు."

" మీ ఎత్తు - బరువు అన్నీ నాకు తెల్సు" చెప్పాడు.

'2 నాకు చాలా భయంకరమైన గతం ఉంది- తెల్సా ?" సంగీత అడిగింది ఆలోచిస్తూ అదే మీ భాషలో నా చరిత్ర ఘోరమైంది."

" తెల్సుకోవాల్సిన అవసరం లేదు అని తెలుసుకోండి."

" ఎందుకు అది నా చరిత్ర - నాలో ఒక భాగం- తెల్సుకు తీరాలి" చెప్పింది.

" నాకు మీ గతంతో పనిలేదు - వర్తమానంలో బ్రతుకుతాను."

" కాని కొన్ని గతాలు గతించవు గదా?" అనురాధ అందించింది.

" నాకు నమ్మకం ఉంది - సంగీత గతం కూడా ఘనంగా ఉంటుంది. ఎటువంటి పొరపాట్లు ఆమె చేయలేదని నాకు తెల్సు" చెప్పాడు.

" ఎందుకలా అనుకుంటున్నారు" అనురాధ అడిగింది.

" ఏమో అలా అన్పించింది" చెప్పాడు.

ఇంతలో సర్వర్ అన్ని ప్లేట్లు తెచ్చి పెట్టాడు పుల్కాలు వడ్డించాడు. ఆబగా ముగ్గురు తింటున్నారు.

" ఇంతకూ నా గురించి మీరేమనుకుంటున్నారో అడగచ్చా!" సుధాకర్ అడిగాడు.

ఆ ప్రశ్నకు సంగీత బుగ్గలు ఎరుపెక్కాయి. అనురాధ ఆమె అవస్థ గమనించి ఆదుకుంది.

" అది అంత అవసరమా - ముందు పుల్కాలు ఆరగించండి" అతను కన్ను ఆర్పకుండా సంగీతను చూస్తూ ఉంటే చెప్పింది.

" వెధవ విందు ఎప్పుడైనా తినచ్చు పొట్టకు - కాని కనువిందు ఎప్పటికో గదా అయ్యేది!" భావుకతతో చెప్పాడు.

" బాగుంది - పొరపాట్లు మీ ఆవిడ అందగత్తె ఐతే ఇంక వంట చేయాల్సిన పనిలేదు మీ ఇంట్లో " అనురాధ చమత్కరించింది.

ఉన్నట్లుండి సంగీత లేచింది. "అయామ్ సారీ ! నాకు తలనొప్పిగా ఉంది."

అతని మొహంలో నిరుత్సాహం కనిపించింది. "ప్లీజ్ ! నాకోసం కాసేపు కూర్చోండి. అంతగా కావాలంటే ట్యాబ్లెట్లు తెప్పిస్తాను" చెప్పాడు ఆర్థింపుగా.

" ఓ ! మందిచ్చి మరీ సుత్తి కొడతారా?" అనురాధ నవ్వింది. సంగీత కూర్చుంది. నిజానికి ఆమెకు వెళ్ళాలని లేదు – కాని మనసులో ఏదో అలజడి. ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోతున్నాయి.

" అనురాధగారు మీరు ఎప్పుడన్నా ప్రేమించారా?" సుధాకర్ అడిగాడు.

" ఓ బోల్డుమందిని ప్రేమించాను" ఆమె తడుముకోకుండా చెప్పింది.

సుధాకర్ నివ్వెరపోయాడు. " ఈజిట్ ! అంత మందిని ఎలా ప్రేమించగలిగారు – ఆడది ఒకసారి మనసిస్తే వెనక్కి తీసుకోలేదంటారు! పోనీ ఎవర్నో తెలుసుకోవచ్చా?"

" ఆ ముందు మా అమ్మని – ఆ తర్వాత మా నాన్నని – మా చెల్లెళ్ళను – నా స్టూడెంట్స్‌ను – ఇలా చెప్పుకుంటూ పోతే చాలామందిని. ఆఖరికి మా ఇంట్లో పెరిగే టమినీ కూడా" చిలిపిగా చెప్పింది.

సుధాకర్ ఊపిరి పీల్చుకున్నాడు. అతని అవస్థకు సంగీత కిలకిల నవ్వింది.

సుధాకర్ నేలమీద వెతకసాగాడు కింద కూర్చుని.

" ఏం పోయింది?" సంగీత అడిగింది.

" ముత్యాలు " చెప్పాడు.

కాసేపటికి అర్థమై మళ్ళీ నవ్వింది.

" ఓ ఫైవ్ మినిట్స్ – ఒక అర్జెంటు ఫోను చేసి వస్తాను" అనురాధ వారి అనుమతి కోసం ఎదురుచూడ కుండా బయటకు నడిచింది పక్కనున్న యస్‌టిడి బూత్‌కోసం.

సుధాకర్ చాలా సంతోషించాడు.

సంగీత కొంచెం కంగారుపడింది.

" సంగీతగారూ ! నా గీత కనుక బాగుంటే తొందరలోనే ఒక ఇంటి వాడ్ని అవుతాను" సిగ్గుపడుతూ చెప్పాడు సుధాకర్.

ఆమె నెత్తిన పిడుగు పడ్డట్టయింది. కొంచెం పాలిపోయింది మొహం. తన ఫీలింగ్స్‌ను కంట్రోలు చేసుకుందామని ప్రయత్నించింది.

చివరికి తడారిపోతున్న గొంతుతో అడిగింది " ఎవరా అదృష్టవంతురాలు?"

" పేరెందుకులేండి – బొమ్మ చూడండి " అంటూ సుధాకర్ జేబులోంచి పర్సు తీశాడు.

కాబోయే శ్రీమతి ఫోటో పర్సులో పెట్టుకు తిరుగుతున్నాడన్నమాట ఈ పెద్దమనిషి.

మరి ఇవేం బుద్ధులు? పెళ్ళి చేసుకోబోతూ తన వెంట పడటమేంటి? ఆమెకు అతనిమీద చాలా ఏహ్యాభావం కలిగింది.

ఇటువంటివాడి గురించా అనవసరంగా ఆశలు పెంచుకుంది తను అని తలవంచుకుని బాధపడసాగింది. అతను పర్సు మడతలు విప్పదీసి చూడమని అడిగాడు.

ఆమె తల ఎత్తలేదు.

" హలో అప్పుడే మీకు జెలసీ కలిగిందా?" అడిగాడు కవ్వింపుగా.

" నాకెందుకు -ఏది చూపించండి" చివ్వున తలెత్తింది.

" చూడండి" అంటూ పర్సు తీసి ఆమె ముందుంచాడు.

ఆ పర్సులో అద్దం ఉంది. అద్దంలోంచి ఆమె మొహం కనిపించింది. కాసేపు ఆమె నమ్మలేక పోయింది. అర్థమయ్యే కొద్దీ ఆనందం అర్ణవమై పోయింది. కొంచెం కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి.

" నన్ను ఆట పట్టిస్తున్నారా?" అనుమానంగా అడిగింది.

" నో ! మీరు చూసింది నిజం - మీకిష్టమైతే మిమ్మల్ని నా ఎదలో దేవతలా కొలుస్తాను" ఆమె కళ్ళలోకి చూస్తూ చెప్పాడు.

" కాని మీరు నా గతం గురించి తెలుసుకోలేదు - తరువాత తెలిస్తే మీరు బాధపడితే నా జీవితం పతనమైపోతుంది" చెప్పింది.

" అఫ్‌కోర్సు - మీ తృప్తికోసం వింటాను- ఈ రోజు కాదు - రేపు సాయంత్రం ఒంటరిగా ఇక్కడికే రండి" చెప్పాడు సుధాకర్.

" ఓకే ! అనురాధ వస్తున్నది " సర్దుకుని కూర్చుంది.

సుధాకర్ కూడా మౌనంగా ఉండిపోయాడు.

" హలో ! ఏంటి? మీ మధ్య కోల్డువార్ నడుస్తున్నదా?"

" ఈ సమావేశాన్ని ఇంతటితో ముగిద్దాం - ముగించే ముందు మంచిగా మూడు పాలు తాగుదాం" చెప్పాడు సుధాకర్.

" కానివ్వండి - ఎలాగూ మురిపాలు లేవు కాబట్టి మూడు పాలతో సర్దుకుందాం!" హాస్యంగా అంది అనురాధ.

" పాపాల భైరవి నువ్వున్నావు కదే మా ఆనందంలో పాలు పంచుకోవడానికి" నవ్వింది సంగీత.

సుధాకర్ బేరర్‌ని పిల్చి మూడు పాలు ఆర్డరిచ్చాడు.

" అనురాధగారు మిమ్మల్ని ఒక విషయం అడగచ్చా అని అడగను. డైరెక్టుగా అడిగేస్తాను అంతే!" సుధాకర్ గడుసుగా అన్నాడు.

" మీరు అడగబోయేది నాకు తెల్సు? నా పెళ్ళి ఎప్పుడు అని అంతేగా " అనురాధ ఊహించి చెప్పింది.

" ఓ నైస్ ! మీకు ఇతరుల మనసులో చదివే తెలివి తేటలు ఆ దేవుడు ఇచ్చినట్లున్నాడు" సుధాకర్ ఆశ్చర్యం నటించాడు.

" చెప్పవే - నేను ఎప్పుడు అడిగా తప్పించుకుంటావు- అతనికి సమాధానం చెప్పు" సంగీత నిలదీసింది.

" ఆ బుద్ధి పుట్టాల్సింది నాకు కాదు-" అనురాధ కొంచెం బాధగా చెప్పింది.

" మీకు కాబోయేవాడిగా" సుధాకర్ అడిగాడు.

" కాదు కన్నవాళ్ళకి..." పొడిగా చెప్పింది.

" అరే ! వాళ్ల బాధ చెప్పుడూ అదేగా?" సంగీత అడిగింది.

" పైకి అలా కనిపిస్తుంది కాని నిజానికి అది కాదు - వాళ్ళకు నేను సంపాదించే యంత్రాన్ని- నాకు పెళ్ళయిననాడు వాళ్ళకొచ్చే ఆదాయం ఆగిపోతుంది. అందుకే నాకు సంబంధాలు చూడరు- లోకం కోసం ఏవో కుంటివో గుడ్డివో చూస్తారు - అవి నేనెలాగూ వద్దంటానని వాళ్ళకు తెల్సు. అడిగిన వాళ్ళకు మీ అమ్మాయికి ఒక్క సంబంధమూ నచ్చలేదని చెబుతారు" చలాకీగా వుండే అనురాధకు మొహం నల్లబడింది.

సర్వర్ పాలు తీసుకొచ్చాడు మూడు గ్లాసుల్లో

" ఎక్సలెంట్ !" చప్పరిస్తూ అన్నాడు సుధాకర్.

" ఏంటి నా జీవితమా?" ఉక్రోషం వచ్చి అడిగింది అనురాధ.

" కాదు - ఏలకులు వేసి చేసిన పాలు" చెప్పాడు.

" మరి నువ్వే చేసుకోవచ్చుగా ఏరికోరి" సంగీత అనుమానం.

" అందరికీ ఆ అదృష్టం రావద్దు" అసూయతో చెప్పింది.

" డోంట్ వర్రీ ! రోజులు ఎప్పుడూ ఒక్కలాగా ఉండవు. ఎండాకాలాం వస్తే వర్షాకాలం రాకుండా ఉంటుందా? వెయిట్ ఫర్ సమ్‌టైమ్!" ఓదార్పుతో చెప్పాడు.

" ఇంతకీ బిల్లు ఎంత?" అనురాధ అడిగింది.

" మీకా శ్రమ ఎందుకు - అవన్నీ చూసుకోవడానికి నే ఉన్నాగా" అంటూ కౌంటరు దగ్గరకుపోయి బిల్లు చెల్లించాడు.

ముగ్గురు బయటికొచ్చారు. అటుగా వస్తున్న ఆటో ఆపి వాళ్ళను ఎక్కించాడు. తాను బైక్‌పైన బయలు దేరాడు. మరునాడు సుధాకర్ ముందుగానే డాబాకు వచ్చి ఉన్నాడు. కొంచెం ఆలస్యంగా వచ్చింది సంగీత.

కుశల ప్రశ్నలు - స్వీట్‌నథింగ్సు - పుద్దు కొట్టింతర్వాత అసలు విషయాని

కొచ్చాడు సుధాకర్.

" గీతగారు ! చెప్పండి – మీ సమస్య ఏంటో " అడిగాడు.

ఆమె బరువుగా నిట్టూర్చింది. "ప్లీజ్ ! నేను చెప్పింది విన్న తర్వాత నన్ను చులకనగా చూడద్దు – నాకు ఎటువంటి హాని చేయనని ప్రామిస్ చేయండి" చిన్న పిల్లలాగా చెయ్యి సాచింది.

" ప్రామిస్ – నా మూలంగా మీకు ఎటువంటి ఇబ్బంది రాదు" చెప్పాడు సుధాకర్.

" ఐతే నే ఒక కథ చెబుతాను– దారిలో అడ్డుపుల్లలు వేయొద్దు– ఎందుకు – ఎలా అని అడగద్దు – దానిలోని పాత్రలు ఎవరూ అని అడగద్దు – దానిమీద మీ అభిప్రాయం చెప్పండి" రాబోతున్న కన్నీటిని అపుకుంటూ చెప్పింది.

" ఓ కే !" బుద్ధిగా చెంపలు వేసుకున్నాడు.

ఒక రోజు ఆ గదిలో కుటుంబ సభ్యులంతా సమావేశమయ్యారు రజియా చిన్న పిల్ల – పన్నేండేళ్ళ పిల్ల – పెద్దలకు మాత్రమే ఆ సమావేశం – ఆడుకోమని పంపించేశారు.

కాని రజియాకు కుతూహలం ఎకు&కవ ఒక కిటికీ పక్కన నక్కింది. చిన్న రంధ్రంలోంచి లోపలికి చూడసాగింది అస్పష్టంగా కొన్ని మాటలు వినిపిస్తున్నాయి. ఏదో విషయం మీద తీవ్ర తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

రజియా తండ్రి కోపంగా ఉన్నాడు.. అతడి అల్లుడు రజియా బావ ఏదో అరుస్తున్నాడు. రజియా అన్న కూడా కోపంగా అరుస్తున్నాడు. రజియా పెద్దక్క ఏదో చెబుతున్నది. కాని అది ఆ మొగాళ్ళకు నచ్చినట్టు లేదు.. రజియా తల్లి కన్నీరు తుడుచుకుంది.

ఆమెని ఒక్క దెబ్బ కొట్టాడు రజియా తండ్రి. ఆమె ఇంకా ఏడుస్తూనే ఉంది. ఏ విషయం మీద అంత వాగ్వివాదం జరుగుతున్నదో రజియాకు అర్థం కాలేదు. ఇంతలో స్నేహితురాలు సానియా వస్తే ఆడుకోవడానికి వెళ్ళింది ఆటల్లో ఆ సంగతి మర్చిపోయింది.

మరునాడు రజియా తండ్రి కుటుంబ సభ్యులను పిక్‌నిక్ అంటూ కార్లో తీసుకుపోయాడు. రజియా రానన్నా బలవంతాన తీసుకు వెళ్ళాడు.

ఇంట్లో రజియా చిన్నక్క రెహనా ఆరోగ్యం బాగాలేదని ఉండిపోయింది. వేరే కారులో వస్తామని రజియా అన్న, బావలు ఉండిపోయారు చెప్పినట్లే వాళ్ళిద్దరూ రెండు గంటల తర్వాత పిక్‌నిక్‌లో కల్సుకున్నారు. అక్కడ వాళ్ళిద్దరూ తండ్రితో ఏదో ముచ్చటించారు. రజియా ఆటల్లో వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నది వినలేదు. ఇంటికి వచ్చేసరికి రాత్రి పది దాటింది. ఎంత కొట్టినా తలుపు తెరవలేదు చిన్నక్క.

బావ వెనక తలుపు తెరిచి లోపలికి ప్రవేశించి గట్టిగా కేకలు పెట్టాడు.

లోపలికిపోయి చూసే సరికి చిన్నక్క దూలానికి వ్రేలాడుతూ ఉంది. నాలుక బయటకొచ్చి ఉంది. దుస్తులు బాగా నలిగిపోయి ఉన్నాయి. చనిపోయే ముందు గిలగిల కొట్టుకున్నట్లుంది. అక్కడక్కడ గీసుకుపోయింది.

అమ్మ గోలగోలగా ఏడ్చింది. రజియా భయపడి పోయింది. కుటుంబ గౌరవం కోసం మరునాడు ఆమెను గుట్టు చప్పుడు కాకుండా సమాధి చేసేశారు. ఎందుకు అలా చేశారు అంటే - ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిస్తే ఇంకా ఇద్దరికి పెళ్లి కాదని చెప్పారు - రజియాకు చిన్నక్కంటే ప్రాణం. ఆమెను మర్చిపోవడానికి రెండేళ్ళు పట్టింది. ఈలోగా అన్నకు పెళ్ళి జరిగింది. వదిన కాపురానికి వచ్చింది. జరీనాతో మంచి అనుబంధం ఏర్పడింది రజియాకు. కాని ఆమె ఎందుకో విచారంగా ఉండేది. అన్న తనను సరిగా చూసుకోవడం లేదని చెప్పేది రజియాకు.

జరీనా కాన్పుకు పుట్టింటికి పోయింది. రజియా అప్పుడప్పుడు చూసి వస్తూ ఉండేది. జరీనా దూరపు చుట్టం జవహర్ తరచుగా ఆ ఇంటికి వస్తూ ఉండేవాడు అక్కా అక్కా అంటూ ఒకసారి అన్నయ్య వున్నప్పుడు వస్తే చాలా ఘర్షణ జరిగింది. జరీనా సర్దిచెప్పింది. అతడు తనకు అన్నయ్య అని, గొడవ అప్పటితో ముగిసింది. జరీనా తిరిగి అత్తగారింటికి వచ్చింది పాపాయితో.

రోజులు గడుస్తున్నాయి.

ఏదో పని ఉండి జవహర్ ఆ ఊరికి వచ్చిపోతూ రజియా ఇంటికి వచ్చి జరీనాను కూడా పలకరించి చీర ఇచ్చివెళ్ళాడు తనకు పెండ్లి కుదురుతున్నదని చెప్పి ఆ విషయం రజియా అన్నయ్యకు తెల్పి ఆ రాత్రి గొడవ జరిగింది.

మరునాడు మళ్ళీ కుటుంబ సమావేశం జరిగింది ఆ గదిలో రజియాను రానియ్యలేదు. వదిన వంటింట్లో పని చేసుకుంటున్నది. రజియా కన్నంలోంచి చూసింది. ఏదో ఘర్షణ... తల్లి ఏడ్వడం చూసింది.. అర్థం కాలేదు.

రెండు రోజుల తర్వాత బంధువుల పెండ్లి అని రజియా తండ్రి కుటుంబ సభ్యులతో కారులో బయలు దేరారు. వదిన పాపను అన్నయ్యను ఇంట్లో వదిలేవారు. వాళ్లు మళ్ళీ వేరే కారులో వస్తారని చెప్పారు. రజియాకు అది ఇష్టం లేదు కాని పెద్దల మాటకు ఎదురు చెప్పకూడదు.

పెళ్ళికి అన్నయ్యరాలేదు - కాసేపటికి వర్తమానం వచ్చింది.. ఇంట్లో గ్యాస్ స్టౌవ్ యాక్సిడెంట్ అయిందని... వదినకు పాపాయికి సీరియస్‌గా ఉందని. హాస్పిటల్లో చేర్చారని. ఏడ్చుకుంటూ హాస్పిటల్‌కు వెళ్ళాం - ప్రైవేటు నర్సింగ్ హోమ్. వదిన కాలిన వళ్ళుతో చావు బతుకుల్లో ఉంది. రజియాను చూసి ఏదో చెప్పాలని ప్రయత్నించింది-

ఏదో సైగలు చేసింది- అర్థం కాలేదు- కాసేపటికి ఆమె మరణించింది. 'జరీనా ఒదినా' అంటూ రజియా ఆమె దేహం మీద పడి ఏడ్చింది.పాపాయి కూడా చచ్చిపోయిందని నర్సు చెప్పింది. అన్నయ్యను పట్టుకోవడం ఎవరివల్ల కాలేదు.

" జరీనా ! నన్ను అన్యాయం చేసి పోయావా" అంటూ కుమిలి కుమిలి ఏడ్చాడు.

ఈ షాక్ నుండి కోలుకోవడాఇకి సంవత్సరంపైన పట్టింది. రజియా చాలా గొప్ప అందగత్తెలా తయారైంది. బావ తరచు ఆమెను ముట్టుకుంటూ ఉండేవాడు ఏదో కారణం చేత చిన్నప్పటి నుండి తెలిసిన బావ తండ్రితో సమానం కాబట్టి రజియా పట్టించుకునేది కాదు. కాని ఎందుకో పెద్దక్క రజియా వంక అదోలా చూసేది.

రజియాకు సంబంధాలు చూడసాగారు. కాన ఏదీ కుదురడం లేదు. ఇలా ఉండగా పక్కింటి అబ్బాయి రజియాను లైన్‌లో పెట్టాడు. ఏకాంతంగా బయట కలుస్తూ ఉండేవాడు. ఆమె కాలేజీకి పోయేటప్పుడు దార్లో కలుసుకుని నవ్వుతూ పోయేవాడు. ఎవరూ లేనప్పుడు చిన్న ఉత్తరం అందించేవాడు.

రజియాకు కూడా అక్బర్ అంటే చాలా ఇష్టం ఏర్పడింది. అతని అందం - అతని సౌమ్యత- అతని అంతస్తు అన్నీ నచ్చాయి. బాగా చదువుకున్నవాడే!

ఒక రోజు అక్బర్ రజియాను చూడ్డానికి ఇంటికి వచ్చాడు. ఘోషా ఉండటం మూలాన బయట వసారాలో కూర్చున్నాడు...

" ఎందుకు వచ్చావు?" అని బావ అడిగాడు.

" మా చెల్లెలుకు నోట్సు కావాలి- రజియాను అడిగి తెమ్మంది" అని చెప్పాడు అక్బర్.

బావ లోపలికి వచ్చి రజియా నోట్సు తీసుకుని అతనికిచ్చి మళ్ళీ ఎప్పుడూ ఇలా రావద్దని వార్నింగు ఇచ్చాడు. అప్పటి నుంచి అక్బర్ అటువైపు కన్నెత్తి చూడలేదు. అక్బర్ చెల్లెలు సుల్తానా ఓ రోజు ఓ ఉత్తరం అందించింది కాలేజీలో.

" రజియా ! నిన్ను పెళ్ళి చేసుకుంటాను. కాని మా అన్న వాళ్ళు మూర్ఖులు- వాళ్ళు మన పెళ్ళికి ఒప్పుకోరు. మన తెగలు వేరు, మీరు షేక్‌లు మేము మొహమ్మదులం- కాని నువ్వు లేకుండా నా బ్రతుకు శూన్యం - ఎలా ఒకటి కావాలో ఆలోచించాలి.." అంటూ చాలా ప్రేమ ఒలకబోశాడు.

ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా ఈ చాదస్తాలు ఏంటి అనిపించింది రజియాకు. ఆ ఉత్తరాన్ని పుస్తకంలో దాచుకుంది. మరునాడు అది కనపడలేదు. వెతికింది దొరకలేదు. దార్లో జారిపోయేందేమో అనుకుంది.

ఆ రోజు కాలేజి నుండి వచ్చేసరికి కుటుంబ సమావేశం జరుగుతున్నది ఆ

గదిలో రజియా కన్నంలోంచి చూసింది. తల్లి ఏడుస్తున్నది. పెద్దక్క కూడా కన్నీళ్ళు తుడుచుకుంటున్నది. తండ్రీ - బావ చాలా కోపంగా మాట్లాడుతున్నారు. అన్న కూడా కోపంగా అరుస్తున్నాడు. తన పేరు ఒకసారి వింది. ఇంతలో వాళ్ళ సమావేశం ముగియడంతో రజియా దూరంగా వచ్చేసింది. ఏం జరిగిందో ఆమెకు అర్థం కాలేదు.

ఆ రాత్రి తల్లి రజియా ప్రక్కన పడుకుంది. ముద్దులతో ముంచెత్తింది. రజియా ఈ మధ్యకాలంలో తల్లి ప్రేమ అంతగా రుచి చూడలేదు. ఆ రాత్రి తల్లి బాధపడ్తూ చెప్పింది.

" నేను హైదరాబాద్ నుండి రాకుండా ఉండాల్సింది."

" హైదరాబాద్ - ఇండియా?" ఆశ్చర్యంగా అడిగింది.

" ఆ ! మా పూర్వీకులంతా అక్కడే ఉన్నారు. మా నాన్న బీదవాడు. డబ్బుకు ఆశపడి మీ నాన్నకు ఇచ్చివేశాడు. మా మతం వేరు - హిందూమతం, మీ నాన్న ఉద్యోగరీత్యా ఇక్కడికొచ్చి ఇక్కడే స్థిరపడి పోయాడు. వీళ్ళతో కలిసిపోయాడు- నా దేశమే బాగుంది... నేను చాలా పొరపాటు చేశాను" ఏడ్చింది రజియా తల్లి.

రజియాకు ఆశ్చర్యం కలిగింది. ఎప్పుడూ తల్లి ఈ విషయం తనతో చెప్పలేదు కాని ఆమె బీరువాలో కొన్ని తెలుగు పుస్తకాలు ఉండటం తను చూసింది. ఆ మాటకొస్తే కొంచెం కొంచెం తెలుగు నేర్పింది తల్లి. ఏదో సరదాగా నేర్చుకుంది తెలుగును. కాని దాని వెనకాల ఇంత కథ ఉందని తనకు తెలీదు. కాని తండ్రి దగ్గర కాని, బయటగాని ఎక్కడా తెలుగు మాట్లాడనిచ్చేది కాదు.

మరునాడు కాలేజీకి సెలవు దినం. తండ్రి తల్లిని... చెల్లిని... అక్కను.. అన్నయ్యను తీసుకుని ఫంక్షనుందని బయలుదేరాడు. రజియా వస్తానని వెంటబడింది.

" రజియా ! బావకు ఒంట్లో బాగాలేదు- నువ్వు తోడుండు... ఆయనకి మందులు - భోజనం పెట్టు- ఓ నాలుగు గంటల్లో మేం తిరిగి వస్తాం" తండ్రి చెప్పాడు.

" పెద్దక్క ఉండచ్చుగా" రజియా అడిగింది అమాయకంగా.

" ఆ ఫంక్షనుకు అది వి.ఐ.పి. అది తప్పకుండా రావాలి" చెప్పివెళ్ళిపోయారు.

బావ లోపల మంచం మీద పడుకుని ఉన్నాడు. రజియా పుస్తకాలు సర్దుకుంటూ ఉంది. వెనక చప్పుడైతే తిరిగి చూసింది. బావ ! కాని తాను ఎప్పుడూ చూసే బావ కాదు.

" ఎంత అందంగా ఉన్నావే ! ఒసే! నన్ను పెళ్ళి చేసుకోకూడదుటే బ్రతికిపోతావు" బాధగా చెప్పాడు - కళ్ళు కాంక్షతో మెరుస్తున్నాయి.

" బావా ! నువ్వు తండ్రిలాంటివాడివి. నిన్నెలా చేసుకుంటాను- పెద్దక్క ఏమవుతుంది?" హాస్యమాడు తున్నాడనుకుంది రజియా.

" అది ముసల్దయిపోయింది– నా మాట విను– నువ్వు నన్ను ఒప్పుకొంటే ఏదో ఒకటి చెప్పి నిన్ను రక్షిస్తాను" చెయ్యి పట్టుకున్నాడు. ఒళ్లు కాలిపోతున్నది. జ్వరం వచ్చినట్లుంది.

" బావా ! నీకు పిచ్చి పట్టిందా? నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావు?" రజియా చెయ్యి విదిల్చి కొడుతూ అడిగింది.

" నాక్కాదే – నీకు మూడింది– నీ చావు దగ్గరకొచ్చింది. నీకు ఆఖరి అవకాశం ఇస్తాను– నాకు లొంగిపో " మీద మీదకు వచ్చాడు బావ.

" బావా – క్యా పాగల్ హో గయా ! నాకేమన్నా జరిగితే నాన్న, అన్నయ్యలు నిన్ను చంపిపారేస్తారు..." ఏడ్పు ఆపుకుంటూ చెప్పింది రజియా.

వికటంగా నవ్వాడు బావ.

" పిచ్చిదానా ! వాళ్ళే నాకు. ఈ పని అప్పగించింది. వాళ్ళు వచ్చేలోగా నిన్ను చంపి పారేయ్యమన్నారు– ఇప్పటికే ఓ గంట వేస్టు ఐపోయింది– మూడు గంటల్లో వాళ్ళు రానే వస్తారు– ఈలోగా–"

బావ మాటలకు రజియా షాక్ తింది. వళ్ళంతా భయంతో కంపించిపోయింది.

" నేను ... నేను నీకేం అపకారం చేశాను– అస్సలు నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నారు?" భయంతో అడిగింది రజియా.

" కుటుంబ గౌరవం కోసం... ఇజ్జత్‌కా సవాల్ ... నువ్వు అక్బర్ గాడితో సంబంధం పెట్టుకున్న విషయం మాకు తెలీదనుకున్నావు కదూ. వాడు రాసిన ఉత్తరం ఇంకా నాదగ్గరే ఉంది" వికటంగా నవ్వాడు.

" మా మధ్య ఎటువంటి అ=కమ సంబంధం లేదు.. ప్రేమించడం తప్పా?" ఆశ్చర్యంగా – బాధగా అడిగింది.

" మనలాంటి పెద్ద కుటుంబాల్లో కొన్ని పద్ధతులుంటాయి. మగాళ్ళతో ఎలా మెలగాలో తెల్సుకోవాలి! నీతి తప్పిన వాళ్ళను హానర్ కిల్లింగ్ చేస్తారు. చెప్పు ఎలా ఛస్తావు... మీ చిన్నక్కలా ఉరివేయ మంటావా? మీ వదినలా గ్యాస్‌స్టౌ యాక్సిడెంట్ చేయమంటావా?" అడిగాడు వెటకారంగా.

రజియాకు ఆ రెండు చావులు గుర్తుకొచ్చాయి. ఆమెకు సర్వం విదితమై పోయింది. భయంతో ఒళ్ళంతా చెమటలు పోశాయి.

" అంటే ! వాళ్ళిద్దర్ని చంపింది నువ్వేనా?"

" సూత్రధారుడిని నేను అయినా – అందరం కల్సి చేసిన పని... వెరైటీగా ఉంటుంది... నీకు పురుగుల మందు ఇస్తాను– తాగుతావా?" అంటూ అతను ఓ మందును

ఓ సీసా నీళ్ళల్లో గుమ్మరించాడు.

" బావా ! ప్లీజ్ ! నన్ను చంపకు.. నీకు దణ్ణం పెడతాను.. నీ కాళ్ళు పట్టుకుంటాను" ప్రాణభయంతో అతని కాళ్ళమీద పడిపోయింది.

" మరి నన్ను చేసుకుంటావా?"

" దానికన్నా నా ప్రాణం పోయినా ఫర్వాలేదు" ఏడుస్తూ చెప్పింది.

ఆ రాక్షసుడు ఆమె కొప్పు పట్టుకుని బలవంతాన లేపాడు - మంచంమీద పడవేసి బలవంతాన నోరు తెరచి ఆ నీళ్ళు నోట్లో గుమ్మరించాడు. ఇంతలో తలుపు చప్పుడైంది... .రజియా ఆ నీళ్ళను తాగకుండా బలవంతాన నోరుమూసుకుంటున్నది. కాని అది నోట్లోకి ముక్కులోకి పోయింది.

ఇంతలో తలుపు విరిగిన చప్పుడైంది. బావ భయపడి బయటికొచ్చాడు. అక్బర్ అతన్ని ఒక్క దెబ్బతో మట్టికరిపించాడు. రజియాను కార్లో వేసుకుని ఆసుపత్రికి బయలు దేరాడు.

ఇదంతా అస్పష్టంగా రజియాకు తెల్సు. కారు బయలుదేరగానే స్పృహ కోల్పోయింది. కళ్ళు తెరిచి చూసే సరికి ఒక ఆసుపత్రి బెడ్‌మీద ఉంది.

" ఇప్పుడెలా ఉంది?" డాక్టరమ్మ అడిగింది. ఆమె పేరు నైటింగేలు- సేవకు ప్రతిరూపం.

" నీరసంగా ఉంది - నాకేమైంది?" రజియా అడిగింది.

" నాలుగు రోజులైంది నీకు స్పృహ పోయి- ఎన్నో మందులు ఇస్తే ఇప్పటికి కళ్ళు తెరిచావు" డాక్టరమ్మ చెప్పింది.

క్రమంగా రజియాకు అంతా గుర్తుకొచ్చింది. భయపడి లేవబోయింది. డాక్టరమ్మ వారించింది.

" మా వాళ్ళు ఎవరూ రాలేదా? అసలు నన్ను ఇక్కడికి ఎవరు తెచ్చారు?"

" అక్బరట! ఆ రోజు వచ్చిందే మళ్ళీ రాలేదు... నీ కోసం కూడా ఎవరూ రాలేదు.."

తరువాత తెల్సింది రజియాను చాలా రహస్యంగా ఆ డాక్టరమ్మ బ్రతికించింది. అక్బర్ ఆమెకు అన్నీ చెప్పాడు. చాలా డబ్బు ముట్టచెప్పాడు. మళ్ళీ వస్తానని చెప్పాడు... కాని రాలేదు.

కలుసుకున్న తర్వాత రజియా ఏడ్చింది... అక్బర్ ఇంటికి ఫోన్ చేయించింది. విషాదవార్త అందుకుంది. అక్బర్ ఓ కారు యాక్సిడెంట్‌లో చనిపోయాడట! రజియా గుండె పగిలి ఏడ్చింది.

" నాకు రక్షణ ఎవరూ ? నేనూ చచ్చిపోతాను" అని ఫిట్సు వచ్చినట్లు ఏడ్చింది.

డాక్టరమ్మ ధైర్యం చెప్పింది. ఆమె క్రైస్తవురాలు చాలా రోజులు రహస్యంగా తనింట్లోనే అట్టి పెట్టుకుంది.

ఒక రోజు వచ్చి ఆమెకు కొన్ని ఫోటోలు - పాస్‌పోర్టు కొంత డబ్బు ఇచ్చింది. కొంత మేకప్ చేసింది.

" ఈ రోజు నుండి నీ పేరు గీత- ఈమె చచ్చిపోయింది కారు యాక్సిడెంటులో... ఆమెకు నీకు చాలా దగ్గర పోలికలున్నాయి... ఈమె ఇండియాకు తిరిగి పోదామనుకునే లోపు చచ్చిపోయింది. నీకిదే మంచి అవకాశం... నువ్వు ఆమె వేషంలో ఇండియాకు వెళ్ళిపో... రజియా చచ్చిపోయిందని నమ్మిస్తాను ఆమె బాడీకి నీ మేకప్పు వేసి.." ఏం చేయాల్సింది బోధించింది.

" కాని డాక్టరు ! నాకు అక్కడ ఎవరున్నారు- పరాయి దేశంలో నేను ఎలా బ్రతకాలి? - అన్నీ ఉండి - అందరూ ఉండిన ఈ దేశంలోనే బ్రతకలేక పోతే అక్కడ నేను ఎలా బ్రతకాలి?..." రజియా సందేహపడింది.

" నీకు భయం అక్కరలేదు - అక్కడ స్వేచ్ఛ ఉంది.. ప్రాణభయం ఉండదు. నా ఫ్రెండ్సు చాలామంది ఉన్నారు... వాళ్లు నిన్ను ఆదుకుంటారు... ఇండియాలో లంచాలకు కాని పన్ను అంటూ ఏమీ లేవు. డబ్బు గురించి నువ్వు ఆలోచించద్దు. నేను కొంత ఇస్తాను. నీ నగలు అమ్మితే కొంత కాలం హాయిగా బ్రతకవచ్చు-వీలోగా మావాళ్లు నీకు ఓ మంచి ఉద్యోగం ఏర్పాటు చేస్తారు- ఈ పీడకలలాంటి గతాన్ని మర్చిపో... కొత్త జీవితం ఆహ్వానించు... ఆల్ ది బెస్టు" అంటూ డాక్టరమ్మ నేర్పుతో ఇండియాకు పంపించి వేసింది.

ఆ రజియా హైదరాబాదులో కొత్త జీవితం ప్రారంభించింది. కాని వాళ్ళవాళ్ళకు అనుమానం వచ్చి రజియా కోసం దేశాలు గాలిస్తున్నారు... ఆమె దొరికితే చంపేద్దామని వెతుకుతున్నారు - అని నైటింగేలు డాక్టరమ్మ ఒకసారి వర్తమానం పంపించింది.

కథ ముగించి ఆమె వలవల ఏడ్చింది.

సుధాకర్ చాలా సానుభూతితో విన్నాడు.

" రజియా ... మతం మార్చుకుంది... భాష మార్చుకుంది స్థానికులతో కల్సిపోయి కొత్త కొత్త విషయాలు నేర్చుకుంది... ఉద్యోగం చేసి తన పొట్ట పోషించు కుంటున్నది... కాని ఎప్పటికీ మరిచిపోలేని చేదు అనుభవం ఆమె గతం.

" ఇప్పుడు చెప్పు సుధాకర్ ! రజియాను పెళ్ళి చేసుకోగలవా? ఆమె ప్రాణానికి అభయం ఇవ్వగలవా?" ఏడుస్తూ అడిగింది.

" ఆ రజియా ఎవరో కాదు నేనే! ఇక్కడకొచ్చి గీత పేరును సంగీతగా

మార్చుకున్నాను."

సర్వర్ తెచ్చిన కూల్‌డ్రింక్సును గడగడ తాగేశాడు సుధాకర్.

" ఎందుకు నా బ్రతుకులో లేనిపోని ఆశలు రేపుతావు? నేను ఒక అనాధను. సర్వం కోల్పోయినదాన్ని... నాద్వారా మీకేమి ఆస్తిపాస్తులు గావు - కట్నకానుకలు రావు - అటువంటి ఆశలుంటే ఇక మీదట నా జోలికి రావద్దు" ఏడుస్తూ చెప్పింది సంగీత.

సుధాకర్ తన జేబు రుమాలు తీసి ఆమెకందించాడు కన్నీళ్ళు తుడుచుకోమని.

" మీకెలా చెప్పాలో నాకు అర్థం కావడం లేదు... నా గురించి నిజం చెబితే అపార్థం చేసుకునే అవకాశం ఉంది" బాధపడ్తూ చెప్పాడు సుధాకర్.

" నా వెనుక దాగిన సత్యాలకంటే భయంకరమైనవి ఉంటాయా?"

" నా పేరు పాల్‌డైమండ్ !"

ఆమె బాంబు పడ్డట్టు ఉలిక్కి పడింది.

" మీరు క్రిష్టియన్లా - సుధాకర్ అని చెప్పారు ! " అడిగింది.

" ఆ.. అదీ నిజమే ! నా ముద్దు పేరు సుధాకర్. సాధారణంగా మాకు రెండు పేర్లు ఉంటాయి. మతం ప్రకారం ఒక పేరు - ఇంట్లో పిల్చుకోవడానికి అనుకూలంగా ఇంకో పేరు. నా పూర్తి పేరు అప్పుడు పాల్‌డైమండ్ సుధాకర్" చెప్పాడు.

" నన్ను మోసం చేశారు" - మొహం మాడ్చుకుని అంది.

" అప్పుడే ఏమైంది ... ఏనాడు నువ్వు నేను ఏం చేస్తుంటానన్నది అడగలేదు ... నా జాబ్ తెలుసా?"

" చెప్పకుండా ఎలా తెలుస్తుంది?"

" నేను సిబిఐ ఆఫీసర్ని" నిదానంగా చెప్పాడు.

సంగీత మొహం పాలిపోయింది భయంతో.

" ముందు నీ వెంట బడటానికి కారణం ఒక కేసు విషయంలో సంగీత హైదరాబాద్ వచ్చింది కాని ... వాళ్ళ వాళ్ళింటికి చేరలేదు. అందుకని రంగారావు పోలీసు కంప్లైంటు ఇచ్చాడు. అది ఇన్ని సంవత్సరాలుగా అలానే పెండింగు ఉంది. పాతఫైళ్ళు తిరగేస్తున్న నాకు సంగీత ఫోటో ఫైలు కన్పించింది. ఎక్కడో చూసినట్లు అనుమానం కలిగి ... నీ వెంట పడ్డాను" చెప్పాడు.

" అంటే ఇప్పుడు నన్ను అరెస్టు చేస్తారా?"

" ఇన్నాళ్ళు ఇదే ఘర్షణలో పడిపోయింది నామనసు. నిజం చెప్పాలా- అబద్ధం చెప్పాలా, నావృత్తికి మానవత్వానికి ఎంతో ఘర్షణ చెలరేగింది. కొందరు న్యాయవాదులతో- న్యాయమూర్తులతో చర్చించాను. ధర్మం వేరు చట్టం వేరు-మానవ ధర్మం గొప్పది. చట్టాలు

మన అనుకూలత కోసం రాసుకున్నవి. ఖచ్చితంగా గౌరవించాల్సినవే. కాని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మార్పులు చేర్పులు ఉంటాయి. ఉదాహరణకు ఒక్కోప్పుడు దేశద్రోహులుగా గుర్తింపబడ్డవాళ్ళని కూడ ప్రభుత్వమే కొన్ని డిమాండ్లకు తలొగ్గి వదిలివేయాల్సి వస్తుంది. తీవ్రవాదులు కూడా జనస్రవంతిలో కలుస్తాం - లొంగిపోతా మంటే ప్రభుత్వం వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంది. అందుకే మనిషిగా, మనసున్న మనిషిగా ఈ కేసును నేను క్లోజ్ చేస్తున్నాను. సంగీత గల్ఫ్‌లోనే చనిపోయిందని- ఆమె బాడీ కూడా దొరకలేదని క్లోజ్ చేస్తాను. ఆమె పాసుపోర్టు దొంగలించబడిందని... అది దొరకదు అని రాసేసి ఫైలు పక్కన పడేస్తాను. కాలగర్భంలో కల్సిపోతుంది.

" ఇదంతా నా కోసం - ప్రాణాలు అరచేత పట్టుకుని శరణు శరణు అంటూ వచ్చిన ఒక శరణార్థి కోసం చేస్తున్నాను. అక్బర్ యాక్సిడెంట్‌లో చనిపోలేదు - చంప బడ్డాడు రజియా వాళ్ళ అన్న చేతిలో. రజియా బావ కొన్నాళ్ళు కోమాలో ఉండి చచ్చిపోయాడు అక్బర్ చేతి దెబ్బలకు. ఇవన్నీ నా ఇన్‌వెస్టిగేషన్‌లో తేలాయి. ఎటొచ్చి నా వృత్తికి ద్రోహం చేస్తున్నానా లేదా అని నా మనసు పీడించింది. కాని ఒక వందమంది దోషులు తప్పించుకున్న ఫర్వాలేదు. ఒక్క అమాయకుడికి శిక్ష పడకూడదని నేను ఈ నిర్ణయం తీసుకున్నాను" సుధాకర్ చెప్పాడు.

" ఐ లవ్ యూ సుధాకర్ - యూ ఆర్ వెరీ గ్రేట్ !" సంగీత అతని చేతిని తీసుకుని ముద్దు పెట్టుకుంది.

" తొలిచూపులోనే ప్రేమించాను. అందుకే నీ కోసం లక్షల ఆస్తి పాస్తులు వున్న సంబంధాలు వచ్చినా వదులుకున్నాను సంగీతా! నువ్వు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తొందరలోనే మన పెళ్ళి సింపుల్‌గా చేసుకుందాం!"

" నేనే మీకు బహుమతిగా వస్తున్నప్పుడు దానికి నా అనుమతి ఎందుకు సుమతీ!" ఆనంద సాగరంలో మునిగిపోతూ సిగ్గుతో తలవంచుకుంది సంగీత.

- జాగృతి 13 ఫిబ్రవరి 2006